

# 2001

'ప్రఫుల్లచంద్ర'

నూతన శతాబ్దంలో మొదటి ఉగాది! ప్రపంచం బద్ధకంగా కళ్ళు తెరిచింది. సూర్యుడు మరింత బద్ధకంగా తన కిరణాల్ని "ప్రపంచం మీద పడండి" అని ఆదేశిస్తున్నాడు. "ఆఁ వెళ్ళవచ్చులే" అని ఆ కిరణాలు హిమకన్యలతో ఆడుకుంటూ ఆలస్యం చేస్తున్నాయి.

మంచం మీద దొర్లుతున్న మూర్తి ఆనాటి కార్యక్రమాలు గుర్తుకువచ్చి టక్కున లేచాడు. ఒకటి—ఆఫీసు వారికి యథాశక్తి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయాలి. అది పెద్ద సమస్య కాదు. మరి, ఆ సాయంకాలం తను పెళ్ళిచూపులకు వెళ్ళాలి. అదీ సమస్య. ఏ డ్రెస్ వేసుకోవాలి? ఎలాంటి విగ్గు పెట్టుకోవాలి? అసలు విగ్గు పెట్టుకోవాలా? ఎలా మెలగాలి? ఏ ప్రశ్నలు వేయాలి? ఎలా చూడాలి? పైగా ఇది మొదటి అనుభవం. ఏదో కొత్తగా, ఉత్కంఠగా ఉంది.

* * *

అమ్మాయి బాగానే ఉంది. కాలుమీద కాలు వేసుకుని, తల వంచీ వంచకుండా, ఠీవిగా కుర్చీలో హుందాగా కూర్చుంది. చింతపండుతో బాగా తోమిన రాగి రంగులో ఉడత తోకంత జుత్తు మెరిసిపోతోంది. ఆమె కళ్ళలోని గమ్మత్తు లేమిటో కనిపెడదాం అనుకున్న మూర్తికి ఆశాభంగమే కలిగింది. సోడా బుడ్డి అంత దళసరి కళ్ళద్దాలు ఆమె ముఖంమీద స్థిరనివాసం ఏర్పరచుకొని ఆ కళ్ళు కనే కలల్ని బయటపడనీయకుండా సదా రక్షిస్తూ ఉంటాయి. నిజానికి ఇంటిల్లిపాదీ అందరూ కళ్ళద్దాలతోనే పుట్టారేమో అనిపిస్తుంది వాళ్ళని చూస్తే. ఆమెకు మాత్రం కళ్ళద్దాలు ఒక డిగ్నిటీని ఇస్తున్నట్టే ఉన్నాయి.

"ఏం మూర్తిగారూ, మా డాలీని అంతలా చూస్తున్నారు. అంత బాగుందా మా అక్క?" అని నవ్వుతూ అడిగాడు కాబోయే బావమరిది. "ఇప్పు...ప్పు... డా...డా...లీ ఎవర్నా?" అని కంగారు పడిపోయాడు — అమ్మాయి పేరు డాలీ అని తెలియని మూర్తి. అతని కంగారు చూసి అంతా— డాలీకూడా—గొల్లున నవ్వేశారు.

అప్పుడు గమనించాడు మూర్తి, ఆమె దంతశోభను. అతని హృదయం కలుక్కుమంది. తాగుతున్న డ్రింక్ పొలమారినట్లు అయింది. తన భార్య నవ్వితే సన్నజాజులు విరబూసినట్లు, ముత్యాలు రాలినట్లు ఉండాలని అతడు కోరుకుంటూ వచ్చాడు. కాని, డాలీ నవ్వితే

